# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 23-06-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరిట రాష్ట్ర ప్రభుత్వం అధికారిక సదస్సును కొద్ది సేపటి క్రితం ప్రారంభించింది.
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.
- అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టుకు కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ఈనెల 26న శంకుస్థాపన చేయనున్నారు.
- రాజధాని అమరావతిలో పలు సంస్థల భూకేటాయింపులకు ఈరోజు రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపింది.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 123వ సంచిక ఈనెల 29న ప్రసారమవుతుంది.

========================

రాష్ట్రంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం పూర్తయిన సందర్భంగా 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరిట ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. కొద్ది సేపటి క్రితం రాష్ట్ర సచివాలయం ప్రాంగణంలో ప్రారంభమయిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు డి.పురందేశ్వరి, ఎన్డీయే కూటమి శాసన సభ్యులు, పార్లమెంట్ సభ్యులు ఇతర నాయకులు పాల్గొన్నారు. దేశ ప్రజలకు సేవ చేసేందుకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా పురందేశ్వరి పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

========================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సచివాలయంలో ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రానున్న ఐదు సంవత్సరాల్లో లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా నూతన పాలసీ ఉండాలన్నారు. క్లస్టర్ల వారీగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఏరోస్పేస్, డిఫెన్స్ పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఎంఎస్ఎంఈ ఉత్పత్తులకు నాణ్యత బెంచ్‌మార్క్, బ్రాండింగ్ కల్పించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మిగతా రాష్ట్రాల కంటే ఈ రంగంలోని ఎంఎస్ఎంఈలను ప్రత్యేకంగా ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇందుకోసం ఏడాదికి ప్రత్యేకంగా 100 కోట్ల రూపాయలతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయడంతో పాటు, లాజిస్టిక్స్ సబ్సిడీ వంటివి నూతన పాలసీలో పొందుపర్చాలని చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు.

========================

అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టును ఈనెల 26న కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ప్రారంబిస్తారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు డి. పురందేశ్వరీలతో కలిసి కేంద్రమంత్రి 26వ తేదీన ఉదయం 10 గంటలకు శంకుస్థాపన చేయనున్నారని కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. ఈ రోజు రాజమహేంద్రవరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో పాత్రికేయులకు ఆ వివరాలను మంత్రి వెల్లడిస్తూ.... ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే పర్యాటక రంగంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా దాదాపు 375 కోట్ల రూపాయల విలువైన పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామని కందుల దుర్గేష్ వివరిస్తూ..

(వాయిస్ 34 సెకన్లు)

========================

ప్రముఖ పుణ్యక్షేత్రం పూరి జగన్నాధుని రథయాత్ర ఈ నెల 27వ తేదీన జరగనుంది. ఈ నేపధ్యంలో భక్తుల సౌకర్యార్ధం పూరీ నగరానికి పలు ప్రత్యేక రైళ్ళను నడపనున్నామని తూర్పు కోస్తా రైల్వే ప్రకటించింది. ఈ నెల 26 నుండి వచ్చే నెల 6వ తేదీ వరకు విశాఖపట్నం - పూరి, జగదల్ పూర్ - పూరి, రాయగడ - ఖుర్దా రోడ్ మార్గాల మధ్య ఇరువైపులా ప్రత్యేక రైళ్ళు నడపనున్నామని తూర్పు కోస్తా రైల్వే సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు.

విరామం

========================

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందుతున్న సామాన్య ప్రజల వినతులు జిల్లా అధికారుల స్థాయిలో తక్షణమే పరిష్కరించాలని శ్రీకాకుళం జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. ఈ రోజు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. శ్రీకాకుళం జిల్లా నలుమూలల నుండి వందలాది మంది ఫిర్యాదుదారులు వారి వారి సమస్యలకు సంబంధించిన వినతులు అందించారని వెల్లడించారు.

========================

రాజధాని అమరావతిలో పలు సంస్థలకు భూకేటాయింపులపై ఈరోజు రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం సమావేశమయ్యింది. ఈ సమావేశానికి మంత్రులు పి.నారాయణ, టి జి భరత్ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. సమావేశం అనంతరం పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పొంగూరు నారాయణ పాత్రికేయుల సమావేశంలో మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపిన వివరాలను వెల్లడించారు. రాజధానిలో మరో ఆరు సంస్థలకు

భూకేటాయింపులు చేశామని.. గతంలో 4 సంస్థలకు చేసిన భూకేటాయింపుల్లో మార్పులు చేపట్టేందుకు మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపిందన్నారు. రెండు సంస్థలకు భూ కేటాయింపులు రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకూ మొత్తం 74 సంస్థలకు భూకేటాయింపులు పూర్తి అయ్యాయని మంత్రి నారాయణ మాట్లాడుతూ...

(వాయిస్ 31 సెకన్లు)

========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 123వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 27వ తేదీ వరకు పంపవచ్చు.

========================

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఇదివరకు చేపట్టిన హౌసింగ్ కాలనీ అభివృద్ధి పనులకు సంబంధించిన పురోగతిపై పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు ఈరోజు సమీక్ష చేశారు. నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలో దృశ్య మాధ్యమం ద్వారా ఈరోజు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పనుల తనిఖీ నిమిత్తం జిల్లాలో 18 బృందాలు ఏర్పాటు చేయగా, మొత్తం 741 పనులకు గాను ఇప్పటి వరకు 277 పనులు మాత్రమే తనిఖీ పూర్తి చేశారని, మిగిలిన 464 పనుల తనిఖీ వారంలోగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

========================

ఇంగ్లాండ్ లో లీడ్స్ వేదికగా భారత్ ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న తొలి టెస్టు రెండవ ఇన్నింగ్స్‌లో 4వ రోజు ఆట ప్రారంభించిన భారత్ జట్టు తొలి విరామ సమయానికి 3 వికెట్ల నష్టానికి 153 పరుగులు చేసింది. అంతకముందు తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 465 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో భారత్ ఆధిక్యం 159 పరుగులకు చేరుకుంది.

========================

ఉత్తర ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీర ప్రాంతాల్లో సగటు సముద్ర మట్టానికి 5.8 నుంచి 7.6 కిలోమీటర్ల మధ్య ఉపరితల ఆవర్తనం విస్తరించి వుందని అమరావతిలో భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజుల్లో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు అనేక చోట్ల కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

========================
========================